యాదగిరిగుట్టలో వైభవంగా లక్ష పుష్పార్చన

యాదగిరిగుట్ట, సెప్టెంబర్ 28 : యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో ఏకాదశి పర్వదినం పురస్కరించుకొని లక్ష పుష్పార్చన పూజలు శాస్త్రోక్తంగా జరిగాయి. శనివారం స్వామి, అమ్మవార్లకు సహస్ర నామ పఠనాలతో అర్చకులు, వేద పండితులు వివిధ రకాల పూలతో లక్ష పుష్పార్చన పూజలు నిర్వహించారు. స్వయంభూ ప్రధానాలయం ముఖ మండపంలో ఉత్సవమూర్తులను పట్టు వస్త్రాలతో దివ్య మనోహరంగా అలంకరించి ప్రత్యేక వేదికపై తీర్చిదిద్దారు. ప్రధానాలయం మొదటి ప్రాకార మండపంలో సుదర్శన నారసింహ హోమం జరిపిన అర్చకులు ఉత్సవమూర్తులను దివ్య మనోహరంగా అలంకరించి కల్యాణోత్సవ సేవను జరిపారు. కల్యాణ మండపంలో స్వామి, అమ్మవార్లను వేంచేపు చేసి కల్యాణ తంతు చేపట్టారు. తెల్లవారుజామునే ఆలయాన్ని తెరిచిన అర్చకులు సుప్రభాతంతో స్వయంభూ నరసింహస్వామిని మేల్కొలిపారు. అనంతరం తిరువారాధన జరిపి, ఉదయం ఆరగింపు చేపట్టారు. ప్రధానాలయంలో స్వామి, అమ్మవార్లకు నిజాభిషేకం జరిపారు. స్వామివారికి తులసీ సహస్రనామార్చన, అమ్మవారికి కుంకుమార్చన, ఆంజనేయస్వామికి సహస్రనామార్చన చేపట్టి భక్తులకు స్వామి, అమ్మవార్ల దర్శన భాగ్యం కల్పించారు. ప్రధానాలయం ముఖ మండపంలో ఉత్సవమూర్తుల పాదాల వద్ద 108 బంగారు పుష్పాలు ఉంచి అష్టోత్తర నామాలు పఠిస్తూ అర్చించారు. సాయంత్రం స్వామివారికి తిరువీధి సేవ, దర్బార్ సేవ అత్యంత వైభవంగా చేపట్టారు. పాతగుట్టలో స్వామివారికి నిత్యారాధనలు అత్యంత వైభవంగా సాగాయి. ఉదయం నుంచి సాయంత్రం వరకు దర్శనాలు కొనసాగాయి. స్వామివారిని దర్శించుకునేందుకు భక్తులు పెద్ద సంఖ్యలో తరలిరావడంతో ఆలయ పరిసరాల్లో సందడి నెలకొన్నది. అన్ని విభాగాలను కలుపుకొని స్వామివారి ఖజానాకు రూ.19,02,687 ఆదాయం సమకూరిందని ఆలయ అనువంశిక ధర్మకర్త బి.నరసింహమూర్తి, ఈఓ భాస్కర్‌రావు తెలిపారు.

నియోజకవర్గ అభివృద్ధే ధ్యేయం

- తుంగతుర్తి ఎమ్మెల్యే సామేల్

సింగిల్‌విండో సర్వసభ్య సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే మందుల సామేల్

అడ్డగూడూరు, సెప్టెంబర్ 28 : నియోజకవర్గ అభివృద్ధే తన ధ్యేయమని తుంగతుర్తి ఎమ్మెల్యే మందుల సామేల్ అన్నారు. మండల కేంద్రంలోని సింగిల్‌విండో కార్యాలయంలో శనివారం జరిగిన సర్వసభ్య సమావేశంలో ఆయన మాట్లాడారు. త్వరలో ధర్మారం వరకు బునాదిగాని కాల్వ రానున్నట్లు తెలిపారు. జానకిపురం బిక్కేరు వాగులోకి నీటిని విడుదల చేయాలని మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డిని కోరగా మూడు రోజుల్లో విడుదల చేస్తానని హామీ ఇచ్చినట్లు తెలిపారు. అడ్డగూడూరులో ఐటీఐ కాలేజీ ఏర్పాటుకు కృషి చేయనున్నట్లు తెలిపారు. తిరుమలగిరిలో జూనియర్ కాలేజీ ఏర్పాటు చేయాలని 40ఏండ్ల నుంచి పోరాటాలు చేయగా.. తాను ఎమ్మెల్యే అయిన 9 నెలల్లోనే కాలేజీ మంజూరు చేయించి ప్రారంభించినట్లు చెప్పారు. మానాయికుంట నుంచి చౌళ్లరామారం వరకు డబుల్ రోడ్డు మంజూరు అయ్యిందని, టెక్నికల్ సమస్యల కారణంగా ఆలస్యం అవుతుందని సమస్యను పరిష్కరించి త్వరలో పనులు ప్రారంభిస్తామని అన్నారు. మూసీ, బిక్కేరు వాగుల నుంచి ఇసుక తరలించడానికి కాంట్రాక్టర్లు పైరవీలు చేయడానికి రోజూ తన దగ్గరకు వస్తున్నారని చెప్పారు. బిక్కేరు వాగు నుంచి ఇసుక రవాణాకు అనుమతులు ఇవ్వనని తెలిపారు. సింగిల్‌విండో చైర్మన్ కొప్పుల నిరంజన్‌రెడ్డి అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో వైస్ చైర్మన్ చేడె చంద్రయ్య, డైరెక్టర్లు పోగుల నర్సిరెడ్డి, ఎల్లంల వీరస్వామి, సంగు సురేందర్‌రెడ్డి, భిక్షం, బైరెడ్డి అశోక్‌రెడ్డి, బాలెంల ఎల్లమ్మ పాల్గొన్నారు.

రాజీ మార్గంలో కేసులను పరిష్కరించుకోవాలి

- ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి ప్రదీప్, అదనపు జూనియర్ సివిల్ జడ్జి చందన

రామన్నపేట లోక్ అదాలత్‌లో మాట్లాడుతున్న జడ్జి ప్రదీప్

రామన్నపేట, సెప్టెంబర్ 28 : క్షణికావేశంలో జరిగిన తప్పులకు రాజీ మార్గం ద్వారా పరిష్కరించుకోవడమే ఇరు వర్గాలకు రాజమార్గం అని ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి ఎ.ప్రదీప్, అదనపు జూనియర్ సివిల్ జడ్జి ఎస్.చందన అన్నారు. జూనియర్ సివిల్ జడ్జి కోర్టు ఆవరణలో శనివారం నిర్వహించిన మెగా లోక్ అదాలత్‌లో వారు మాట్లాడారు. రాజీ మార్గం ద్వారా కేసులను పరిష్కరించుకుంటే సమయం, డబ్బు ఆదా అవుతుందన్నారు. ఇరువర్గాల మధ్య కక్ష సాధింపులు తగ్గుతాయని తెలిపారు. రాజీ అయిన కేసులను కక్షిదారులు లోక్ అదాలత్‌లో పరిష్కరించుకోవాలన్నారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు ఎంఏ మజీద్, సీఐ వెంకటేశ్వర్లు, పీపీలు ఖాజాఅలీ, యాదయ్య, సూపరింటెండెట్‌లు నారగోని గంగాభవాని, బాలగోని శివరాజు, న్యాయవాదులు జింకల ప్రభాకర్, లింగయ్య, సత్తయ్య, మామిడి వెంకట్‌రెడ్డి, శ్రవణ్‌కుమార్, డేవిడ్ పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్ నాయకుడికి మాజీ మంత్రి జగదీశ్‌రెడ్డి పరామర్శ

సత్తయ్య కుటుంబీకులను పరామర్శిస్తున్న మాజీ మంత్రి జగదీశ్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే కూసుకుంట్ల ప్రభాకర్‌రెడ్డి

చౌటుప్పల్ రూరల్, సెప్టెంబర్ 28 : మండలంలోని మల్కాపురం గ్రామంలో ఇటీవల మృతిచెందిన గిర్కటి సత్తయ్యగౌడ్ దశదిన కర్మను శనివారం నిర్వహించగా.. మాజీ మంత్రి గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే కూసుకుంట్ల ప్రభాకర్‌రెడ్డి పాల్గొన్నారు. బీఆర్‌ఎస్ మండలాధ్యక్షుడు గిర్కటి నిరంజన్‌గౌడ్‌కు, అయన కుటుంబీకులకు సానుభూతి తెలిపారు. ఇంటి పెద్దను కోల్పోయినప్పుడు గుండె నిబ్బరంగా ఉండాలని, కుటుంబానికి బీఆర్‌ఎస్ పార్టీ అండగా ఉంటుందని అన్నారు. కార్యక్రమంలో సింగిల్‌విండో చైర్మన్ చింతల దామోదర్‌రెడ్డి, మాజీ సర్పంచ్ ఎలువర్తి యాదగిరి, నాయకులు మస్తాన్ యాదవ్, బాలరాజు, సీపీఎం నాయకులు బూర్గు కృష్ణారెడ్డి, బండారు నర్సింహ పాల్గొన్నారు.

వెంకటేశ్వరాలయం హుండీ చోరీ

రాజాపేట, సెప్టెంబర్ 28 : మండల కేంద్రంలోని వేంకటేశ్వర ఆలయ హుండీని గుర్తు తెలియని దుండగులు శుక్రవారం రాత్రి చోరీ చేశారు. హుండీని కొద్ది దూరం తీసుకెళ్లి రాళ్లతో పగులగొట్టే ప్రయత్నం చేశారు. అది ఫలించకపోవడంతో సమీపంలోని చెట్ల పొదల్లో పడేసి పోయారు. స్థానికుల సమాచారం మేరకు పోలీసులు వచ్చి విచారణ చేపట్టారు.

'రాజాపేటకు కాళేశ్వరం జలాలే శరణ్యం'

రాజాపేట, సెప్టెంబర్ 28 : మండలానికి కాళేశ్వరం జలాలే శరణ్యమని మదర్ డెయిరీ మాజీ డైరెక్టర్ చింతలపూరి వెంకట్ రాంరెడ్డి అన్నారు. మండల కేంద్రంలో శనివారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎత్తిపోతల తపాస్‌పల్లి ప్రాజెక్ట్ ద్వారా రాజాపేట మండలానికి సాగు జలాలు అందించడం సాధ్యం కాదని గతంలోనే ఇరిగేషన్ అధికారులు సర్వే చేసి నివేదికలు ఇచ్చారన్నారు. కాళేశ్వరం 15వ ప్యాకేజీ ద్వారా మండలంలోని చెరువులు, కుంటలు నింపేందుకు గత ప్రభుత్వం నిధులు మంజూరు చేసి కొంత మేర కాల్వల పనులు చేశారని తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం కాలయాపన చేయకుండా కాల్వ పనులు చేపట్టి గొలుసుకట్టు చెరువులు నింపాలని డిమాండ్ చేశారు.

గర్భిణులు పౌష్టికాహారం తీసుకోవాలి

- మోత్కూరు మున్సిపల్ చైర్‌పర్సన్ కవిత

గర్భిణులకు చీరె, సారెతో సామూహిక శ్రీమంతం చేస్తున్న మున్సిపల్ చైర్‌పర్సన్ కవిత

మోత్కూరు, సెప్టెంబర్ 28 : గర్భిణులు బలవర్ధకమైన పౌష్టికాహారం తీసుకోవాలని మోత్కూరు మున్సిపల్ చైర్‌పర్సన్ గుర్రం కవిత అన్నారు. పట్టణంలోని అంగన్‌వాడీల పరిధిలోని గర్భిణులకు శనివారం సామూహిక శ్రీమంతం, ఆరు మాసాల పిల్లలకు అన్నప్రాసన చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తల్లులు పండ్లు, పాలు, పప్పు, ఆకుకూరలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ సీడీపీఓ జ్యోత్స్న, మండల వైద్యాధికారి అమరావతి, సూపర్‌వైజర్ ఊర్మిల, వైద్య సిబ్బంది, అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు.

రాజీ మార్గమే రాజమార్గం : జడ్జి మహంతి వైష్ణవి

లోక్ అదాలత్‌లో మాట్లాడుతున్న జడ్జి మహంతి వైష్ణవి

చౌటుప్పల్, సెప్టెంబర్ 28 : కేసుల విషయంలో రాజీ మార్గమే రాజమార్గమని చౌటుప్పల్ కోర్టు జడ్జి మహంతి వైష్ణవి అన్నారు. పట్టణంలోని కోర్టులో శనివారం నిర్వహించిన లోక్ అదాలత్‌లో పలు కేసులను పరిష్కరించారు. ఈ సందర్భంగా జడ్జి మాట్లాడుతూ కక్షిదారుల సౌకర్యార్థం త్వరితగతిన కేసుల పరిష్కారానికి లోక్ అదాలత్‌లు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు ఊడుగు శ్రీనివాస్‌గౌడ్, తాడూరి పరమేశ్, నర్రి స్వామి, జెల్ల రమేశ్, టి.మహిపాల్‌రెడ్డి పాల్గొన్నారు.

వ్యాక్సినేషన్ పకడ్బందీగా చేపట్టాలి

- జిల్లా ఇమ్యూనైజేషన్ అధికారి రామకృష్ణ

తుర్కపల్లి : సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా ఇమ్యూనైజేషన్ అధికారి రామకృష్ణ

తుర్కపల్లి, సెప్టెంబర్ 28 : చిన్నారులకు నిర్వహించే వ్యాక్సినేషన్ పకడ్బందీగా చేపట్టాలని జిల్లా ఇమ్యూనైజేషన్ అధికారి రామకృష్ణ అన్నారు. మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని శనివారం ఆయన సందర్శించి రికార్డులను పరిశీలించారు. వ్యాక్సిన్ నిల్వ చేసే ఫ్రీజర్‌ను పరిశీలించి వైద్య సిబ్బందితో మాట్లాడారు. వ్యాక్సిన్‌ను ఎప్పుడూ ఫ్రీజర్‌లో నిల్వ ఉంచేలా చూసుకోవాలన్నారు. సమావేశంలో వైద్యాధికారి రుచిరారెడ్డి, సీహెచ్‌ఓ రాజయ్య, హెల్త్ అసిస్టెంట్ సునీల్, వైద్య సిబ్బంది ఉన్నారు.

వ్యాక్సినేషన్‌ను విజయవంతం చేయాలి

బొమ్మలరామారం : ప్రజలకు రోగనిరోధక శక్తిని పెంచి రోగాల బారిన పడకుండా నిర్వహించే వ్యాక్సినేషన్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని జిల్లా ఇమ్యూనైజేషన్ అధికారి డాక్టర్ రామకృష్ణ అన్నారు. మండలంలోని పిల్లగుండ్ల తండా గ్రామంలో శనివారం చేపట్టిన ఇమ్యూనైజేషన్ కార్యక్రమాన్ని ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. హెల్త్ సబ్‌సెంటర్‌లో చిన్న పిల్లలకు అందుతున్న వైద్య సేవల గురించి అడిగి తెలుసుకున్నారు. బొమ్మలరామారం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలోని వ్యాక్సిన్ నిల్వలు, రికార్డులను పరిశీలించారు. మండల వైద్యాధికారి సుమలత, డాక్టర్ శ్రావణి, పర్యవేక్షకులు జనార్దన్, సుమతి, వైద్య సిబ్బంది కృష్ణ, ప్రవీణ్, నూర్జహాన్, జయ, హరిత, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు

ప్రభుత్వ నిబంధనల మేరకు ధాన్యం కొనుగోళ్లు చేపట్టాలి

వ్యాపారులు, రైతులతో సమావేశమైన వెంకటేశ్వర్లు

మోత్కూరు, సెప్టెంబర్ 28 : ప్రభుత్వ నిబంధనల మేరకు ధాన్యం కొనుగోళ్లు చేపట్టాలని మోత్కూరు ఎఫ్ఎస్‌సీఎస్ చైర్మన్ పేలపుడి వెంకటేశ్వర్లు అన్నారు. మోత్కూరు వ్యవసాయ మార్కెట్ కార్యాలయంలో వ్యాపారులు, రైతులతో శనివారం ఆయన సమావేశం నిర్వహించారు. మోత్కూరు మార్కెట్ పరిధిలోని మోత్కూరు, అడ్డగూడూరు, గుండాల, ఆత్మకూరు(ఎం) మండలాల పరిధిలో వేబ్రిడ్జిల ద్వారా ధాన్యం కొనుగోళ్లు విచ్చలవిడిగా చేస్తున్నారని పలువురు రైతులు ఆందోళన వ్యక్తం చేశారు. వ్యాపారులు తక్కువ ధరకు ఖరీదు చేస్తున్నారని తెలిపారు. క్వింటాకు హమాలీ రూ.25 వసూలు చేయాలని, ధాన్యం కొనుగోలు చేసిన వెంటనే డబ్బులు చెల్లించాలని కోరారు. కమీషన్ పేరిట రైతుల నుంచి డబ్బులు వసూలు చేయవద్దని, మార్కెటింగ్ నిబంధనలు పాటించకపోతే చర్యలు తప్పవని హెచ్చరించారు. సమావేశంలో మార్కెట్ కార్యదర్శి ఉమామహేశ్వర్‌రావు, రైతులు, వ్యాపారులు పాల్గొన్నారు.

వార్డుల్లో సమస్యలు పరిష్కరిస్తా : ఎమ్మెల్యే కుంభం

27వ వార్డులో సీసీ, డ్రైనేజీ నిర్మాణ పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే అనిల్‌కుమార్‌రెడ్డి

భువనగిరి అర్బన్, సెప్టెంబర్ 28 : పట్టణంలోని అన్ని వార్డుల సమస్యలను పరిష్కరిస్తానని ఎమ్మెల్యే కుంభం అనిల్‌కుమార్‌రెడ్డి అన్నారు. పట్టణంలోని 12, 13, 20, 22, 25, 27, 28, 30, 31వ వార్డుల్లో మున్సిపల్ జనరల్ ఫండ్ రూ.65లక్షలతో నిర్మించే సీసీ రోడ్డు, డ్రైనేజీ పనులకు శనివారం శంకుస్థాపన చేశాడు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వార్డుల్లోని ప్రజల సమస్యలను దశలవారీగా పరిష్కరిస్తానన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ పోతంశెట్టి వెంకటేశ్వర్లు, కమిషనర్ పి.రామానుజులరెడ్డి, కౌన్సిలర్లు, అధికారులు, నాయకులు పాల్గొన్నారు.

హక్కుల కోసం మహిళలు ఉద్యమించాలి : ఐద్వా

రాజాపేట, సెప్టెంబర్ 28 : మహిళలు తమ హక్కుల కోసం ఉద్యమించాలని ఐద్వా జిల్లా ప్రధాన కార్యదర్శి బట్టుపల్లి అనూరాధ పిలుపునిచ్చారు. మండల కేంద్రంలో శనివారం ఏర్పాటు చేసిన సంఘం సమావేశంలో ఆమె మాట్లాడారు. మహిళలకు పెను భారమవుతున్న నిత్యావసర వస్తువుల ధరల పెరుగుదలను అరికట్టాలన్నారు. అనంతరం పట్టణ కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షురాలిగా విజయ, ఉపాధ్యక్షురాలిగా సిరియారాణి, సహాయ కార్యదర్శిగా రజిత, కోశాధికారిగా కీర్తన ఎన్నికయ్యారు. సమావేశంలో నాయకులు పబ్బోజు రాధమ్మ పాల్గొన్నారు.

'నాన్ పర్మినెంట్ కార్మికుల పెండింగ్ వేతనాలు విడుదల చేయాలి'

కలెక్టర్ హనుమంతు కె.జెండగేకు వినతి పత్రం ఇస్తున్న సీఐటీయూ నాయకులు

భువనగిరి అర్బన్, సెప్టెంబర్ 28 : నాన్ పర్మినెంట్ కార్మికుల పెండింగ్ వేతనాలు విడుదల చేసి, వారిని పర్మినెంట్ చేయాలని సీఐటీయూ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు దాసరి పాండు, కల్లూరి మల్లేశం ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. నాన్ పర్మినెంట్ కార్మికుల సమస్యల పరిష్కారం కోసం శనివారం కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వ రంగంలో 25నుంచి 30 సంవత్సరాలుగా పనిచేస్తున్నప్పటికీ రెగ్యులర్ చేయలేదన్నారు. గ్రామ పంచాయతీ, మోడల్ స్కూల్ వంట సిబ్బంది, అవుట్‌సోర్సింగ్ ఏఎన్ఎంలకు 5నుంచి 11నెలలుగా వేతనాలు పెండింగ్‌లో ఉన్నాయని తెలిపారు. కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన నాలుగు లేబర్ కోడ్‌లను రద్దు చేయాలన్నారు. బీబీనగర్ స్టెర్లింగ్ స్టోనెక్స్ ఇండస్ట్రీలో తొలగించిన కార్మికుడిని విధుల్లోకి తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో గ్రామ పంచాయతీ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ పైళ్ల గణపతిరెడ్డి, రాష్ట్ర మహిళా కన్వీనర్ పొట్ట యాదమ్మ, సీఐటీయూ జిల్లా నాయకులు గొరిగె సోములు, బోడ భాగ్య, మాయ కృష్ణ, తుర్కపల్లి సురేందర్, ఈశ్వర్, ఆయా రంగాల కార్మిక నాయకులు, కార్మికులు పాల్గొన్నారు.

జీతం కోసం కాకుండా పిల్లల ప్రగతి కోసం పని చేయాలి : అందెశ్రీ



ఉపాధ్యాయురాలి దంపతులను సన్మానిస్తున్న ప్రముఖులు

చౌటుప్పల్, సెప్టెంబర్ 28 : ఉపాధ్యాయులు నెల జీతం కోసం కాకుండా పేద పిల్లల అభివృద్ధి కోసం పని చేయాలని తెలంగాణ గీత రచయిత అందెశ్రీ అన్నారు. పట్టణంలోని జిల్లా పరిషత్ హైస్కూల్‌లో శనివారం ఏర్పాటు చేసిన ఆంగ్ల ఉపాధ్యాయురాలు బండారు సుజాత ఉద్యోగ విరమణ సన్మాన సభలో ఆయన మాట్లాడారు. మన తెలంగాణ ఊరి బడులు బాగుపడాలంటే కార్పొరేట్ విద్యను తలదన్నేలా ఉపాధ్యాయులు బోధించాలన్నారు. ఆ దిశగా ప్రతి ఉపాధ్యాయుడూ పని చేయాలని సూచించారు. విధి నిర్వహణలో అంకితభావంతో పనిచేస్తే సమాజంలో మంచి గుర్తింపు లభిస్తుందన్నారు. అనంతరం ఉపాధ్యాయురాలి దంపతులను సన్మానించారు. మాజీ ఎమ్మెల్యే పల్లా వెంకట్‌రెడ్డి, మున్సిపల్ చైర్మన్ వెన్‌రెడ్డి రాజు, ప్రముఖ కవి కూరెళ్ల విఠలాచార్య, ఎస్ఆర్‌టీ మాజీ డైరెక్టర్ ఆనంద కిశోర్, ఎంఈఓ గురువారావు, ప్రధానోపాధ్యాయుడు కె.శివకుమార్ పాల్గొన్నారు.

ప్రతిఒక్కరూ ఆరోగ్య సూత్రాలు పాటించాలి

- డీఎంహెచ్ఓ యశోద

సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా వైద్యారోగ్య శాఖ అధికారి యశోద

చౌటుప్పల్, సెప్టెంబర్ 28 : గుండె పదిలంగా ఉండాలంటే ప్రతి ఒక్కరూ ఆరోగ్య సూత్రాలు పాటించాలని జిల్లా వైద్యారోగ్య శాఖ అధికారి డాక్టర్ యశోద అన్నారు. ప్రపంచ గుండె దినోత్సవంలో భాగంగా మున్సిపాలిటీ పరిధిలోని తంగడపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో శనివారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆమె మాట్లాడారు. నిత్యం క్రమం తప్పకుండా శారీరక వ్యాయామం చేయాలన్నారు. పండ్లు, శాఖాహార పదార్థాలు తినడం అలవాటు పెంచుకోవాలని, బీపీ, షుగర్ టెస్టులు చేయించుకొని దానికి తగ్గట్టు మందులు వాడాలని సూచించారు. మానసిక ఒత్తిడికి గురికావద్దన్నారు. పీఓఎన్‌సీడీ డాక్టర్ సుమన్ కళ్యాణ్, వైద్యులు సంపత్, హెచ్ఈఓలు సత్యనారాయణ, ఇస్తారి, పీహెచ్ఎన్ శశికళ పాల్గొన్నారు.

కంటి వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలి

భువనగిరి అర్బన్, సెప్టెంబర్ 28 : పాఠశాలలో నిర్వహించే కంటి వైద్య శిబిరాలను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని గిరిజన సంక్షేమ అధికారి టి.నాగిరెడ్డి అన్నారు. గిరిజన సంక్షేమ శాఖ, రెడ్‌క్రాస్ సొసైటీ, రోటరీ క్లబ్ ఆఫ్ సెంట్రల్ భువనగిరి సంయుక్త ఆధ్వర్యంలో పట్టణంలోని గిరిజన ఆశ్రమ పాఠశాలలో శనివారం కంటి వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా 110 మంది విద్యార్థినులకు ఉచిత కంటి పరీక్షలు చేశారు. ఈ సందర్భంగా నాగిరెడ్డి మాట్లాడుతూ కంటి పరీక్షలు చేసుకోకుండా నిర్లక్ష్యం వహిస్తే చూపు కోల్పోయే ప్రమాదం ఉందన్నారు. కార్యక్రమంలో రెడ్ క్రాస్ సొసైటీ వైస్ చైర్మన్ దిడ్డి బాలాజీ, డైరెక్టర్లు డాక్టర్ జయశ్రీ, రాంబాయి, సిరాజొద్దీన్, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు నారాయణ రెడ్డి, సిబ్బంది, విద్యార్థినులు పాల్గొన్నారు.

రైతు సంక్షేమమే నా లక్ష్యం : పీఏసీఎస్ చైర్మన్ చింతల

పీఏసీఎస్ సర్వసభ్య సమావేశంలో మాట్లాడుతున్న చైర్మన్ దామోదర్‌రెడ్డి

చౌటుప్పల్, సెప్టెంబర్ 28 : రైతు సంక్షేమమే తన లక్ష్యమని పీఏసీఎస్ చైర్మన్ చింతల దామోదర్‌రెడ్డి అన్నారు. శనివారం జరిగిన సొసైటీ సర్వసభ్య సమావేశంలో సంఘం ఆదాయ, వ్యయాలను చదివి వినిపించారు. సంఘం నిధులతో గోదాం, రైతు శిక్షణ కేంద్రం, ఆఫీసు కార్యాలయాన్ని నిర్మించాలని, సంఘం ఆధ్వర్యంలో వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలని తీర్మానించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ సీసీఐ పత్తి కొనుగోలు కేంద్రాన్ని ఏర్పాటు చేసి మద్దతు ధర ఇవ్వాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. దొడ్డు వడ్లకు కూడా రూ.500 బోనస్ ఇవ్వాలన్నారు. సమావేశంలో సంఘం వైస్ చైర్మన్ చెన్నగోని అంజయ్యగౌడ్, డైరెక్టర్లు నర్సిరెడ్డి, రూపమ్మ, కృష్ణ, వెంకటయ్య గౌడ్, శ్రీశైలం, పద్మ, శశిధర్‌రెడ్డి, బాలరాజు పాల్గొన్నారు.

షరతులు లేకుండా రుణమాఫీ చేయాలి : జంగారెడ్డి

సమావేశంలో మాట్లాడుతున్న అనంతుల జంగారెడ్డి

మోటకొండూర్, సెప్టెంబర్ 28 : ఎన్నికల్లో ఇచ్చిన హామీ ప్రకారం రైతులందరికీ షరతులు లేకుండా రూ.2లక్షల రుణమాఫీ చేయాలని మార్కెట్ కమిటీ మాజీ డైరెక్టర్ అనంతుల జంగారెడ్డి అన్నారు. మండల కేంద్రంలో శనివారం బీఆర్‌ఎస్ నాయకులతో కలిసి విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఇప్పటి వరకు రూ.లక్షలోపు కూడా రుణమాఫీ అందరికీ కాలేదని, ఎన్నికల్లో ఇచ్చిన హామీ ప్రకారం రూ.2లక్షల రుణమాఫీ ఎప్పుడు చేస్తారని ప్రశ్నించారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వం అందించిన రైతు బంధును కాంగ్రెస్ ప్రభుత్వం ఎందుకు ఇవ్వడంలేదో చెప్పాలన్నారు. ఈ ప్రభుత్వం ఉచిత హామీలతో రాష్ట్ర ప్రజలను మోసం చేస్తుందని ఆరోపించారు. సమావేశంలో బీఆర్‌ఎస్‌వై ప్రధాన కార్యదర్శి జివిలికపల్లి వెంకటేశ్, సోషల్ మీడియా కన్వీనర్ గంధమల్ల మధు, నాయకులు మధు, ఇస్తారి, మధు, ప్రవీణ్‌జై పాల్గొన్నారు.

చెడు అలవాట్లకు దూరంగా ఉండాలి

- డిప్యూటీ డీఎంహెచ్ఓ డాక్టర్ శిల్పిని

ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించిన డిప్యూటీ డీఎంహెచ్ఓ డాక్టర్ శిల్పిని

భూదాన్ పోచంపల్లి, సెప్టెంబర్ 28 : చెడు అలవాట్లకు దూరంగా ఉండాలని, మద్యం, పొగ సేవించరాదని డిప్యూటీ డీఎంహెచ్ఓ డాక్టర్ శిల్పిని అన్నారు. పట్టణంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని శనివారం ఆమె సందర్శించారు. వరల్డ్ హార్ట్ డే సందర్భంగా గుండె ఆరోగ్యం గురించి వివరించారు. రోజూ ఎక్సైజ్ చేయాలని, పొగాకు నమలవద్దని, మందు సేవించవద్దని, బీపీ, షుగర్ పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. సమతుల్య ఆహారం తీసుకోవాలని, హిమోగ్లోబిన్ శాతం 12గ్రాములకు పైగా ఉండేలా చూసుకోవాలని అన్నారు. కార్యక్రమంలో మండల వైద్యాధికారి శ్రీవాణి, సూపర్‌వైజర్స్ అరుంధతి, శ్రీదేవి, శ్రీనివాస్, ల్యాబ్ టెక్నీషియన్ పద్మ, ఫార్మాసిస్ట్ ప్రదీప్, ఆరోగ్య, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

కార్మిక వ్యతిరేక విధానాలపై పోరాడాలి : ఐఎఫ్‌టీయూ

ఆలేరు రూరల్, సెప్టెంబర్ 28 : కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల కార్మిక వ్యతిరేక విధానాలపై పోరు సాగించాలని ఐఎఫ్‌టీయూ జిల్లా అధ్యక్షుడు సుదర్శన్ అన్నారు. ఈ నెల 30న హైదరాబాద్‌లోని ఇందిరాపార్కు వద్ద జరిగే కార్మిక మహాధర్నా పోస్టర్‌ను మండలంలోని మందనపల్లిలో శనివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్రంలో ప్రధాని నరేంద్ర మోదీ, రాష్ట్రంలో సీఎం రేవంత్‌రెడ్డి ప్రభుత్వాలు అనుసరిస్తున్న ప్రజా, కార్మిక వ్యతిరేక విధానాలు, లేబర్ కోడ్‌లు, ప్రభుత్వ రంగ సంస్థల ప్రైవేటుపరం, కార్మికులను శ్రమదోపిడీకి గురిచేస్తున్న విధానాలను ఎండగట్టాలని పిలుపునిచ్చారు. ఐఎఫ్‌టీయూ నాయకులు తమ్మడి రమేశ్, యాదగిరి, మార్కండేయ, స్వామి, రమేశ్, రాములు, యాదగిరి, వెంకటాద్రి పాల్గొన్నారు.

పోషకాహారంతో వ్యాధి నిరోధక శక్తి పెంపు : డీడబ్ల్యూఓ


రాంలింగంపల్లి సెక్టోరియల్ సమావేశంలో మాట్లాడుతున్న డీడబ్ల్యూఓ నర్సింహారావు

బొమ్మలరామారం, సెప్టెంబర్ 28 : పోషకాహారం తీసుకోవడం వల్ల వ్యాధి నిరోధకశక్తి పెరుగుతుందని డీడబ్ల్యూఓ నర్సింహారావు అన్నారు. పోషక మాసోత్సవంలో భాగంగా మండలంలోని రాంలింగంపల్లి గ్రామ అంగన్‌వాడీ కేంద్రంలో గర్భిణులకు పోషకాహారంపై శనివారం అవగాహన సదస్సు, బొమ్మలరామారం సెక్టార్ మీటింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా గర్భిణులకు సామూహిక సీమంతాలు చేశారు. వృద్ధులను సన్మానించారు. కార్యక్రమంలో సీడీపీఓ శాగంటి శైలజ, ఏసీడీపీఓ రమ, సూపర్‌వైజర్ నాగమణి, అంగన్‌వాడీ టీచర్లు సబిత, ఉమ, తేజ, మంజుల, మీనా, పుష్పలత, నాగమణి, సుల్తానా, రేణుక, సుజాత, రమాదేవి, ప్రమీల, మహిళలు, వృద్ధులు పాల్గొన్నారు

'భగత్‌సింగ్ పోరాటాన్ని యువత స్ఫూర్తిగా తీసుకోవాలి'

ఆలేరు టౌన్ : భగత్‌సింగ్ చిత్రపటానికి నివాళి అర్పిస్తున్న ఎస్ఎఫ్ఐ నాయకులు

ఆలేరు టౌన్, సెప్టెంబర్ 28 : భగత్‌సింగ్ పోరాటాన్ని యువత స్ఫూర్తిగా తీసుకోవాలని ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు కాసుల సురేశ్ అన్నారు. భగత్ సింగ్ 117వ జయంతిని పురస్కరించుకొని ఆలేరులోని వివిధ కళాశాలల్లో ఎస్ఎఫ్ఐ, డీవైఎఫ్ఐ, ఎన్ఎస్‌యూఐ ఆధ్వర్యంలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. ఈ సందర్భంగా విద్యార్థి నాయకులు మాట్లాడుతూ అతి చిన్న వయసులో దేశం కోసం ప్రాణత్యాగం చేసిన విప్లవయోధుడు భగత్ సింగ్ అన్నారు. ఆయనను విద్యార్థులు స్ఫూర్తిగా తీసుకొని ముందుకు వెళ్లాలని సూచించారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ నాయకులు కామిని ప్రణయ్, మల్లికార్జున్, సాయి, గణేశ్, డీవైఎఫ్ఐ విప్లవ్, బోనగిరి గణేశ్, నవీన్, మౌర్య, భరత్, రాజు, అజయ్, వివిధ కళాశాలల విద్యార్థులు పాల్గొన్నారు.

భగత్ సింగ్ జయంతి వేడుకలు

వలిగొండ : మండల కేంద్రంలో ఏఐవైఎఫ్ ఆధ్వర్యంలో శనివారం భగత్‌సింగ్ 117వ జయంతి వేడుకలను నిర్వహించారు. ఈ సందర్భంగా భగత్‌సింగ్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. భగత్ సింగ్ ఆశయ సాధనకు యువత కృషి చేయాలని సూచించారు. కార్యక్రమంలో ఎల్లంకి మహేశ్, పోలెపాక యాదయ్య, సాయిని యాదగిరి, సుద్దాల సాయికుమార్, నరేశ్, బొడిగె సుదర్శన్, విన్సెంట్ పాల్గొన్నారు.

గుండె సంబంధిత వ్యాధులపై అవగాహన

సమావేశంలో మాట్లాడుతున్న హెచ్ఈఓ గోపాల్

రామన్నపేట, సెప్టెంబర్ 28 : ప్రపంచ హృదయ దినోత్సవం సందర్భంగా మండలంలోని మునిపంపుల గ్రామంలో గుండె సంబంధిత వ్యాధులపై మండల వైద్యాధికారి అశ్విన్‌కుమార్, హెచ్ఈఓ గోపాల్ ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ప్రజలకు బీపీ, షుగర్ పరీక్షలు నిర్వహించి మందులు ఇచ్చారు. గుండెకు మంచి చేసే ఆహార నియమాలు, వ్యాయామాలు, గుండెకు చెడు చేసే అలవాట్ల గురించి తెలియజేశారు. కార్యక్రమంలో ఏఎన్ఎంలు రజిత, ప్రశాంతి, ఆశ వర్కర్లు పాల్గొన్నారు.

గ్రామపంచాయతీల్లో ఓటర్ల జాబితా ప్రదర్శన

అడ్డగూడూరు, సెప్టెంబర్ 28 : మండలంలోని అన్ని గ్రామపంచాయతీల్లో రెండవ సాధారణ ఎన్నికలు – 2024 కోసం ఎన్నికల సంఘం ప్రకటించిన వార్డుల వారీగా ఓటర్ల జాబితాను శనివారం ఎంపీడీఓ శంకరయ్య ప్రదర్శించారు. ప్రకటించిన తుది ఓటర్ల జాబితాను మండలంలోని 17 గ్రామాల్లో ప్రదర్శించినట్లు ఆయన తెలిపారు.

గురుకుల పాఠశాల పరిశీలన

పాఠశాలలో రికార్డులను పరిశీలిస్తున్న ఎంఈఓ సబిత

అడ్డగూడూరు, సెప్టెంబర్ 28 : మండల కేంద్రంలోని గురుకల పాఠశాలను ఎంఈఓ సబిత శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా రికార్డులను తనిఖీ చేశారు. తరగతి గదులను పరిశీలించి విద్యార్థినులతో మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. పాఠశాల ఆవరణ పరిశుభ్రంగా ఉంచాలని, విద్యార్థినులకు నాణ్యమైన భోజనం అందించాలని సిబ్బందికి ఆదేశించారు. ఆమె వెంట ప్రిన్సిపాల్ రమ, సిబ్బంది ఉన్నారు.